క్లుప్తంగా

పాత పింఛన్ అమలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ఆ సంఘ నాయకులు పలు డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక నిరాహార దీక్ష చేశారు. రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ జీపీఎస్, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, జీవీ రమణ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేస్తే లక్షలాది మంది ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కళాకారులు

చిత్తూరు రూరల్: నాలుగో విడత జగనన్న చేదోడు పథకం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని గిరింపేటలో గురువారం నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నికల హామీలను విధిగా పాటిస్తూ, సీఎం నాయీ బ్రాహ్మణులకు ఏటా రూ.10వేల ఆర్థికసాయం అందిస్తున్నారని అధ్యక్షులు హరిప్రసాద్ పేర్కొన్నారు.

21న ఆటో డ్రైవర్ల సలహా వేదిక సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్ల అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు రూరల్: నగర ఆటో డ్రైవర్ల సలహా వేదిక సమావేశాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు ఆటో డ్రైవర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్ తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. మాలిక్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ కనీస చార్జీల పెంపునకు అందరూ ఐక్యం కావాలన్నారు. హై రోడ్డు నుంచి మురకంబట్టు, గాంధీ సర్కిల్, గిరింపేట వైపు నడిపే ఆటో డ్రైవర్లకు కొత్త ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లైసెన్స్ లేని ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ రుసుముతో లైసెన్స్ ఇవ్వడానికి ఆర్టీఓ అధికారులు సహకరించాలన్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రూ.5500ను యూనియన్ తరఫున కట్టిస్తామన్నారు. ఆటోలో ఎమర్జెన్సీ పేషెంట్లను వేలూరు సీఎంసీ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లడానికి అనుమతి ఇవ్వాలన్నారు. ఇక వివిధ సమస్యలపై చర్చించేందుకు ఆటో డ్రైవర్లు సలహా వేదిక సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జగనన్న పాల వెల్లువ సర్వే వేగవంతం



టి.పుత్తూరులో పాల వెల్లువ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్

తవణంపల్లె: జగనన్న పాల వెల్లువ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ అన్నారు. మండలంలోని మిట్టపల్లె, టి.పుత్తూరు, నలిశెట్టిపల్లె గ్రామాల్లో గురువారం పాల వెల్లువ సర్వేను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి కుటుంబసభ్యులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకొని సమగ్రంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కల్లా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో ఇప్పటి వరకు 60 శాతం మాత్రమే సర్వే చేశారని వెల్లడించారు. సర్వర్ సమస్యతో సర్వే ఆలస్యమవుతోందని వివరించారు. ఎంపీడీఓతో పాటు ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిష్యత్తు చిరుధాన్యాలదే!

కుప్పం రూరల్: భవిష్యత్తు చిరుధాన్యాలదేనని ఏరువాక చిత్తూరు కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రెడ్డి రాము, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం మండలంలోని జరుగు, గుడ్లనాయనపల్లె, క్రిష్ణాదాసనపల్లెలో రాగి, సామ పంటల దిగుబడిని వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కుప్పం ప్రాంతంలో చిరుధాన్యాల్లో రాగి, సామ అధికంగా పండిస్తారన్నారు. ఇందులో కొత్త రకాలైన తిరుమల, వకుళ రకాలను సాగు చేస్తే ఎకరాకు మరో 4 క్వింటాళ్ల దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. ప్రపంచం మొత్తం చిరుధాన్యాలను ఉత్తమమైన ఆహారంగా భావించి భారతదేశం వైపు చూస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అమృతవల్లి, విస్తరణాధికారి ఔరంగ్, రైతులు పాల్గొన్నారు.

చిత్తూరు : సురక్ష కిట్లు అందజేస్తున్న మేయర్ అముద, వైద్యాధికారులు



చిత్తూరు : వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు



పూతలపట్టు : లబ్ధిదారుకు ఆయుష్మాన్ కార్డును అందజేస్తున్న అధికారులు, నాయకులు



ఆరోగ్య సురక్షకు అపూర్వ స్పందన

- మందులు, వైద్య పరీక్షలు ఉచితం
- క్యాంపులకు తరలివస్తున్న జనం
- వైద్య శిబిరాలు విజయవంతం

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని చిత్తూరు నగర మేయర్ ఎస్.అముద చెప్పారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ వార్డు సచివాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ అముద, స్థానిక కార్పొరేటర్ సృజనీరెడ్డి పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి, ప్రజలతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పరీక్షలతో పాటు మందులు సైతం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్, డ్వాక్రా మహిళల ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పది మంది ప్రత్యేక వైద్య నిపుణులు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, మెప్మా సీఎంఎం గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు భూపేష్ గోపినాథ్, హేమరెడ్డి, వైద్యులు, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బంగారుపాళెం : పాలేరులో వైద్య పరీక్షల కోసం శిబిరానికి తరలి వచ్చిన జనం

ప్రజల కోసమే ఆరోగ్య సురక్ష

బంగారుపాళెం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని పాలేరు గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 357 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు, కళ్లద్దాలను అందజేశారు. ఐసీడీఎస్ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్, స్పెషలిస్టు డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వైద్యం

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం అందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని పేట అగ్రహారం పంచాయతీ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి చూపు మందగించిన వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిక, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రా రెడ్డి, రవినాయుడు, మణి, వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంజీవని

తవణంపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సంజీవనిలా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలంలోని అరగొండ బాలుర హైస్కూల్లో గురువారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, సర్పంచ్ మల్లుదొరైతో కలిసి ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు ప్రియాంక, వినయ్‌కుమార్, మోహన్‌వేలు, ధాత్రేయచౌదరి, ప్రత్యేక వైద్యులు డాక్టర్ సంయుక్త, డాక్టర్ రామప్రకాష్, డాక్టర్ ఉషా శ్రీధర్ 374 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరీం, ప్రశాంతకుమార్, మధుకుమార్, వైద్య బృందం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు చైతన్య, మహేష్, వీఆర్‌ఓ రాజేశ్వరి, చలపతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

ఐరాల: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని బొమ్మసముద్రం, చిగరపల్లె సర్పంచులు స్వప్న, రఘు అన్నారు. మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని చిగరపల్లె సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు 193 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దృష్టి లోపం ఉన్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, పూర్ణలత, ఎంపీడీఓ నాగరాజు, ఎంపీటీసీ విజయకుమారి, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. ఓ సువర్ణాధ్యాయం

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ సువర్ణాధ్యాయమని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామభద్రాపురంలో డెప్యూటీ తహసీల్దార్ కల్యాణి టీం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య శిబిరంలో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం బాధితులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు హరి, అనూష, పురుషోత్తం, వైఎస్సార్ సీపీ నాయకులు రజినీకాంత్, సాయిక్రిష్ణ, శిలంబరసన్, గుండుసాయి, ప్రసాద్‌గౌడ్‌తోపాటు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వైద్యసేవలు

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని దాసరాపల్లె సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందరికీ ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించారు.






గుడిపాల: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, యాదమరి: దాసరాపల్లె సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి, ఐరాల: చిగరపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న కంటి డాక్టర్లు, తవణంపల్లె : స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వృద్ధాశ్రమానికి రూ.75 వేల విరాళం



వృద్ధాశ్రమ ప్రతినిధులకు చెక్కు ఇస్తున్న దాతలు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం అభివృద్ధికి యూఎస్ఏలోని రాయలసీమ అసోసియేషన్(ధారా) వారు రూ.75 వేల చెక్కును గురువారం రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్‌కు అందించారు. ఈ సందర్భంగా ధారా అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వద్ధాశ్రమం అభివృద్ధికి ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. వృద్ధాశ్రమంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ మాట్లాడుతూ వృద్ధాశ్రమం అభివృద్ధికి రూ.75 వేలు అందించడం అభినందనీయమన్నారు.

వెంకన్నకు నృత్య నీరాజనం

తిరుపతి కల్చరల్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నగరంలోని పలు కళా వేదికలపై కళాకారులు, సంగీత, నృత్యాభినయాలతో గరుడ వాహనదారుడైన వెంకన్నకు ఘన నీరాజజన పలికారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి, అన్నమాచార్య కళామందిరం, శ్రీరామచంద్రపుష్కరిణి వేదికలపై సంగీత, నృత్య, నాటక, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా మహతిలో జయలక్ష్మీ, జితేంద్ర కళాబృందం ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. అన్నమాచార్య కళామందిరంలో అరవింద్ ఆర్ట్స్ అకాడమీ వారి నృత్యాభినయం భక్తి పారవశ్యంగా సాగింది.

ధరణి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కార్వేటినగరం: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతనంగా ప్రవేశపెట్టిన ధరణి డిపాజిట్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంకు మేనేజర్ వహిద అన్నారు. గురువారం డీసీసీ బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ధరణి డిపాజిట్ పథకం ద్వారా సీనియర్ సిటిజన్లకు 8.50 శాతం అదనపు వడ్డీ సౌకర్యం, డిపాజిట్లకు డీసీసీ బ్యాంకులో ఇన్సూరెన్సు సౌకర్యం ఉందన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేయడం వల్ల వాణిజ్య బ్యాంకుల కన్నా అధిక వడ్డీ పొందవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సూర్యప్రభపై లక్ష్మీనారాయణుడి విహారం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనారాయణుడు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణస్వామి వారికి ఆస్థాన మండపంలో ప్రధాన అర్చకులు మాధవన్ దాశరథి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య తిరుమంజనం సేవ నిర్వహించారు. అలాగే సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై నుంచి స్వామి వారు భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శ్రీధర్ సుమిత్ర దంపతులు, అడ్వొకేట్ వాసు, మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దేవీ అలంకారం దివ్య తేజోమయం

చిత్తూరు రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నగరం గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో గురువారం అభిషేకాలు చేసి విశేష అలంకరణ చేశారు. సహస్రనామ, కుంకుమార్చన చేసి శ్రీకాత్యాయని దేవిగా అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పోటెత్తిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. కోదండరామస్వామి ఆలయంలో నరసింహావతారంలో స్వామివారిని అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో భగవతి మాత అలంకరణలో అమ్మవారు కనువిందు చేశారు. ముత్యాలమ్మ ఆలయంలో పార్వతీదేవి అలంకారం, శేషాపీరన్‌వీధిలోని షిరిడి సాయిబాబా ఆలయంలో ద్రవ్యం అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కట్టమంచిలో విశ్వసాయిబాబా ఆలయంలో మీనాక్షి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అన్ని మండపాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

శాకాంబరిగా..

ఐరాల: దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల్లో మండలంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదురోజు గురువారం స్థానిక గ్రామ దేవత పాలేటమ్మ ఆలయంలో అమ్మవారు శాకాంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించి భక్తులకు కటాక్షించారు. వైఎస్ గేటులోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీ మహాలక్ష్మీదేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: దేవీనవరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ శ్రీమహాలక్ష్మిదేవి అంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు మురళీ గురుకుల్ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల సుగంధ పుష్పాలతో నయనానందకరంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వజ్రాలపురంలో..

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ అర్ధనారీశ్వరిగా భక్తులను కటాక్షించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వజ్రాలపురానికి తరలి వచ్చారు. భక్తులకు ఆలయం వారిచే తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మండలంలోని తగ్గువారిపల్లెలోని దండుమారెమ్మ, మొగిలివెంకటగిరిలోని గంగమ్మ, బంగారుపాళెం ఓం శక్తి ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయం వారిచే తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





గుడిపాల: కాత్యాయినీ దేవిగా దుర్గమ్మ, లలితాదేవి అలంకరణలో పల్లూరు గంగమ్మ


కాత్యాయినీదేవిగా దుర్గమ్మ

గుడిపాల: మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వేడుకగా నిర్వహించారు. కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం మూలస్థాన దుర్గమ్మ వారు కాత్యాయినీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లూరు గంగమ్మ దేవాలయంలో గంగమ్మ అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

గాయత్రీదేవి అలంకరణలో..

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని శ్రీ మరగదాంబికా దేవి గురువారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలస్థానంలో వెలసిన అమ్మవారికి అభిషేకాలు అలంకరణలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయంలో కుంకుమార్చన నిర్వహించి, రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. కాళికామాత ఆలయంలో అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని మహాచండీగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.







చిత్తూరు: పార్వతిగా ముత్యాలమ్మ, కాత్యాయనిగా దుర్గాంబ, ఐరాల: శాకాంబరిగా పాలేటమ్మ, సరస్వతిగా చాముండేశ్వరి, బంగారుపాళెం: అర్ధనారీశ్వరిగా వజ్రాలపురం గంగమ్మ, శ్రీమహాలక్ష్మిగా ముత్యాలమ్మ, కాణిపాకం: గాయత్రిగా మరగదాంబికాదేవి, మహాచండీగా కాళికామాత